క్లుప్తంగా

రేపు రుద్రసహిత నవ చండీ యాగం

దర్శి: స్థానిక అంకాలమ్మ ఆలయంలో ఈ నెల 6వ తేదీన శ్రీ రుద్ర సహిత నవ చండీ యాగం నిర్వహిస్తున్నట్లు శ్రీ అంకాలమ్మ, శ్రీపోలేరమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కర్నా రమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక శుద్ధ పంచమి అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రంలో దేవీ ఆరాధన, రుద్రాభిషేకం, శ్రీచండీ సప్తశతి పారాయణం, శ్రీ నవచండీ యాగాలు జరుగుతాయన్నారు. భక్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేషన్ షాపుపై కేసు నమోదు

పెద్దారవీడు: మండల పరిధిలోని తోకపల్లిలో రేషన్ షాపును తహసీల్దార్ శైలేంద్రకుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ గోపి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రేషన్ షాపులో ఉండాల్సిన బియ్యం కంటే తక్కువగా 1684 కేజీలు బియ్యం ఉన్నాయంటై డీలర్ ఉప్పలపాటి నాసరయ్యపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ తెలిపారు. మంగళవారం తహసీల్దార్‌కు పూర్తి సమాచారంతో నివేదికను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

9 కేరళ మద్యం బాటిళ్లు స్వాధీనం

కురిచేడు: మండలంలోని పడమరగంగవరం గ్రామానికి చెందిన నాగరాజు వద్ద కేరళ మద్యం 9 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎస్సై తన సిబ్బందితో పడమర గంగవరం సోమవారం రాత్రి వెళ్లి నాగరాజు ఇంటిని తనిఖీ చేశారు. కేరళ మద్యం 9 బాటిళ్లు లభ్యమైనట్లు గుర్తించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఖాళీ ప్లేట్లతో మున్సిపల్ కార్మికుల నిరసన

మార్కాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాజకీయ కారణాలతో తొలగించిన కార్మికులు తమ పొట్ట కొట్టారంటూ ఖాళీ ప్లేట్లు చూపుతూ సోమవారం నిరసన తెలిపారు. నిబంధనలు పాటించకుండా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. పురపాలక సంఘం కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారంతో 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 21 మంది కార్మికులను సరైన కారణం చూపకుండా తొలగించడం అన్యాయమన్నారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి నాయకులు, అధికారులు కార్మికుల రిలే దీక్షను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించటంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా అక్రమంగా తొలగించి ఉపాధిని దెబ్బతీయడం దారుణమన్నారు. ఇప్పటికైనా మాటలు కట్టిపెట్టి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, జి.హరి, ఇమాంసా, చెన్నకేశవులు, సుబ్రహ్మణ్యం, శ్రీను, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుడిపాడుకు

సాగర్ జలాలు ఇవ్వరా?


సమ్మర్ స్టోరేజీలో ఉన్న సాగర్ జలాలు


ట్యాంక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

దొనకొండ: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు చందవరం సమ్మర్ స్టోరేజీలో సాగర్ జలాలు ఉన్నా పెద్దగుడిపాడు గ్రామానికి సాగర్ జలాలు సరఫరా నిలిచిపోయాయి. గ్రామంలో సాగర్ ట్యాంక్ నిర్మించి సుమారు 40 ఏళ్లు అయినా అధికారులు నీరు సక్రమంగా సరఫరా చేయ్యక నేడు నేనున్నానంటూ అలంకార ప్రాయంగా గ్రౌండ్ లెవల్ ట్యాంక్ మిగిలిపోయింది. గ్రామంలో సుమారు 220 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ రోజూ పొలం పనికి వెళ్లాల్సి ఉంది. తాగటానికి సాగర్ జలాలు సరఫరా కాకపోవటంతో చేతి పంపుల్లోని ఫ్లోరైడ్ నీరు తాగి వ్యాధులకు గురవుతున్నారు. చేతి పంపుల నీటితో తరుచూ జ్వరాలు, కీళ్ల నొప్పులు, ఒళ్ల నొప్పులు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొనకొండ-దర్శి రహదారి పక్కనే వాటర్ ట్యాంక్ నిర్మించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చూసుకుంటూ వెళ్తున్నారు. గ్రామస్తుల మంచినీటి సమస్య పరిష్కరించలేక పోతున్నారు. తమ సమస్య పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, తాము ఎన్ని రోజులు చేతి పంపుల్లోని ఫ్లోరైడ్ నీరు తాగాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ కూడా శిథిలావస్థకు చేరింది. అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. ట్యాంకు చుట్టూ నెర్రలు కొట్టి అధ్వానంగా తయారైంది. కొన్ని రోజుల నుంచి చుక్క సాగర్ జలాలు గ్రామానికి రావడం లేదని, అధికారులు స్పందించి తమ గ్రామానికి సాగర్ జలాలు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నూతనంగా విధుల్లో చేరా

నేను నూతనంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా విధుల్లో చేరా. సిబ్బందితో మాట్లాడి సమస్య తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

మంచి నీటి సమస్య పరిష్కరించాలి



మా గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రౌండ్ లెవల్ ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టి సాగర్ జలాలు సరఫరా చేయాలి. కొన్ని రోజుల నుంచి సాగర్ జలాలు రాకపోవటంతో చిన్నారులకు ఆరోగ్యం ఇబ్బందికరంగా ఉంటుంది.

– చెన్నమ్మ, పెద్దగుడిపాడు

చేతి పంపు నీరు తాగితే జబ్బులు వస్తున్నాయి



మా గ్రామానికి సాగర్ జలాలు రాకపోవడంతో చేతి పంపు నీరు తాగి కీళ్ల నొప్పులు, జ్వరాలు వస్తున్నాయి. అధికారులకు ఎన్ని సార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. గతంలో 40 సంవత్సరాల కిందట నిర్మించిన ట్యాంక్ నేడు శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ చుట్టూ పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. చిల్లచెట్లు మొలిచాయి.

– ఎం.వెంకటేశ్వర్లు, పెద్దగుడిపాడు

అధికారులు వెంటనే నీరు సరఫరా చేయాలి



గతంలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టి సాగర్ జలాలు అందించాలి. చందవరం సమ్మర్ స్టోరేజీలో సాగర్ జలాలు ఫుల్‌గా ఉన్నా సరఫరా కాకపోవటం అధికారుల నిర్లక్ష్యం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు మా గ్రామానికి వచ్చి వెళ్తున్నారు. తాగునీటి సమస్య సమస్యగానే మిగిలిపోయింది.

– హనుమంతు, పెద్దగుడిపాడు

పత్తికి తెల్లదోమ ముప్పే


పెద్దారవీడులో సాగు చేసిన పత్తి పంట

పెద్దారవీడు: మండలంలో పత్తి పంటను గతంలో కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంట పూత దశలో ఉంది. రైతులు ఈ దశలో ఉన్న పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలి. లేకుంటే తెల్లదోమ, గులాబీరంగు పురుగు బారిన పడి పంటను నష్టపోయే ప్రమాదం ఉంది. నాలుగైదు ఏళ్లుగా ఎక్కువ మంది రైతులు తెల్లదోమ, గులాబీరంగు పురుగుతో నష్టపోయారు. పంట చేతికి వచ్చే సమయంలో వచ్చే వీటి విషయంలో అజాగ్రత్తగా ఉంటే అసలుకే మోసం వస్తుంది. అత్యంత ప్రమాదంగా మారి పంటను పూర్తిగా నాశనం చేసే తెల్లదోమను అరికట్టే విధానంపై రైతులకు పెద్దారవీడు వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి పలు సూచనలు చేస్తున్నారు.

తెల్లదోమ గుర్తించే విధానం ఇలా..

తెల్లదోమ ఆకుల కింద భాగంలో గుంపులుగా గుంపులుగా ఉంటాయి. ఈ దోమ సీజనోతో సంబంధం లేకుండా సంవత్సరం పొడవునా కనిపిస్తుంది. పిల్లదోమ పాలిపోయిన పసుపు రంగులో ఉండగా పెద్ద దోమ పూర్తి పసుపు రంగులో ఉండి రెక్కలు పొడవుగా ఉంటాయి. ఈ దోమలు అడుగు భాగంలో ఉండి గుడ్లను పెడతాయి. ముఖ్యంగా చలికాలంలో వీటి వృద్ధి ఎక్కువగా ఉంటుంది. ఏడాదికి 12 నుంచి 15 సార్లు జన్మిస్తాయి. దోమలు ఆకులకు రంధ్రాలు చేస్తూ వాటిలో రసాన్ని మొత్తం తాగేస్తుండటంతో మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. దీంతో అప్పటి వరకు ఉన్న కాయల్లో తయారవుతున్న పత్తి కూడా విచ్చుకోకుండా లోపలే నల్లగా మారిపోతుంది. తెల్లదోమ దాటికి కొన్ని సార్లు పత్తి మొక్క ఆకులన్నీ పాలిపోవడంతో పాటు బిరుసెక్కి మొక్క నుంచి రాలిపోతాయి.

గులాబీ రంగు పురుగు

గులాబీ రంగు పురుగు పంట కాలం 100 రోజుల నుంచి మొత్తం 120, 140 రోజుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. దీర్ఘకాలికంగా ఒకే రకం హైబ్రీడ్ విత్తనం సాగు చేయడంతో పత్తితీతలు అలస్యం కావడంతో ఈ పురుగు ఎక్కువయ్యేందుకు ప్రధాన కారణాలు. పురుగు లార్వా దశ మొత్తం కాయలోనే ఉండటం ద్వారా పత్తి కాయ పగిలిన తర్వాతే పురుగు ఉధృతి కనిపిస్తోంది. మూడు నుంచి ఆరు వారాల్లో మొత్తం దశను గులాబీరంగు పూర్తి చేస్తుంది.

నివారణ చర్యలు

◈ తెల్లదోమ ఎక్కువగా ఉంటే పసుపు రంగు అట్టలకు జిగురు పూసి పొలంలో అక్కడక్కడా పెట్టాలి. దీంతో తెల్లదోమ అట్టలకు అకర్షించబడి జిగురుకు అతుక్కుపోతుంది.

◈ కీటకాలను ఎక్కువగా ఆకర్షించే టమోట, అముదం మొక్కలను పొలంలో అక్కడక్కడా వేసుకుంటే మంచిది. పత్తి పంట కంటే ముందుగా వీటిపైనే దోమ వాలుతుంది. వాటిని గమనించుకుంటూ మందులు పిచికారీ చేసుకోవచ్చు.

◈ పత్తిలో అంతర పంటలుగా కంది, అలసంద, మినుము, కొర్రలు వంటివి సాగు చేసుకుంటే మిత్రపురుగులు పెరగడంతో రసం పీల్చే పురుగుల వృద్ధి తగ్గుతుంది.

◈ దోమ బారి నుంచి తప్పించుకోవడానికి వేప గింజల కషాయం, వేప నూనెను నీటిలో కలిపి ఆకుల కింద భాగం మొత్తం తడిసేలా పిచికారీ చేసుకుంటే మంచిది.


◈ తెల్లదోమ నివారణ కోసం రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు పిచికారీ చేసినా పెట్టుబడులు పెరగడం తప్ప ఎటువంటి ఉపయోగం ఉండదు.

తెల్లదోమపై అవగాహన ఉండాలి:

పత్తి పంటను నాశనం చేసే తెల్లదోమను గుర్తించడంలో రైతులకు అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పొలానికి వేళ్తే బాగా కనబడుతుంది. ఆకు కింద భాగంలో చేరి రసాన్ని మొత్తం పీల్చేస్తుంది. ఆకులు పాలిపోయి రాలిపోతాయి. పొలంలో పసుపురంగు అట్టలకు జిగురు పూసి పెడితే ఆకర్షణకు గురై వాటికి అతుక్కుంటాయి. వేప నూనె, గింజల కషాయాన్ని పిచికారీ చేస్తే దోమబారి నుంచి పంటను రక్షించుకోవచ్చు.

కె.బుజ్జిబాయి, ఏఓ, పెదారవీడు

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు


పుల్లలచెరువు: ముటుకుల శివాలయంలో..


కురిచేడు: కాళహస్తీశ్వరస్వామి


తాళ్లూరు: పూజలందుకుంటున్న నీలకంఠేశ్వరస్వామి


కురిచేడు: జ్ఞానప్రసూనాంబదేవి

దర్శి: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పట్టణంలోని కాశీ అన్నపూర్ణాదేవి మాతా సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో తెల్లవారు జామునే భక్తులు ఆలయానికి చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారికి మహారుద్రాభిషేకం,అష్టోత్తర శతనామావలి పూజలు, బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి కార్తీక దీపాలు వెలిగించి మొక్కలు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తాళ్లూరు: మండలంలోని మాధవరం నీలకంఠేశ్వరస్వామి, లక్కవరం కాశీ అన్నపూర్ణాసమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో తెల్లవారు జామునే స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు.

కురిచేడు: కార్తీకమాసం ఆరంభం కావడంతో మొదటి సోమవారం శైవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో వేకువజాము నుంచి ఆలయానికి వచ్చి దీపాలు వెలిగించారు. దీపకాంతులతో ఆలయం కళకళలాడింది. అనంతరం స్వామివారికి ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. మాలధారణస్వాముల శరణుఘోషతో ఆలయంలో భక్తులు పులకితులయ్యారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

పెద్దదోర్నాల: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు భారీగా చేరుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరాలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అయ్యప్ప స్వామి దేవాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చెన్నమల్లేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు అధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పుల్లలచెరువు: కార్తీక మాసంలో మొదటి సోమవారం కావడంతో మండలంలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో సందడిగా మారాయి. మండలంలోని పుల్లలచెరువు, చాపలమడుగు, ముటకుల, శతకోడు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు వేకువ జాము నుంచే స్వామివారిని దర్శనాలు చేసుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మొదటి సోమవారం కావడంతో ఆలయాలు అన్నీ భక్తులతో నిండి ఉన్నాయి. ముటుకుల శివాలయంలో పూజారి భరద్వాజశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.


దర్శి: బారులు తీరిన భక్తులు


దర్శి: కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మాజీ చైర్మన్‌కు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


షకీలా అమీన్‌బాషాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే


మేడం రెడ్డెయ్యను పరామర్శిస్తున్న బూచేపల్లి

దర్శి: స్థానిక మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ షకీలా అమీన్ బాషా ఇటీవల మోకాళ్ల ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. గోల్డ్‌షాపు నిర్వాహకులు మేడం రెడ్డెయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గోల్డ్ షాప్ నిర్వాహకులు తల్లం రాధాకృష్ణ మూర్తి కుమార్తె వివాహ వేడుకలకు హాజరయ్యారు. లింగన్నపాలెంలో బండి యోగేశ్వరి వివాహ వేడుకలకు హాజరయ్యారు. క్రిస్టియన్ పాలెంలో ఇత్తడి వారి వివాహ వేడుకలకు హాజరయ్యారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, రైతు నాయకులు

పుల్లలచెరువు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి గురునాథం అన్నారు. పార్టీ ఆదేశాలపై సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేసి గురునాథం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెట్టుబడి సాయం కింద ఒక్కో రైతుకు రూ.20 వేలు ఇస్తానని చెప్పి నెలలు కావస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లు వెళ్లిపోతున్నా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం బాధాకరమైన విషయమన్నారు. నాయకులు మాటలు చెప్పడం కాదు చేతులతో చూపాలని, రైతులు వ్యవసాయ పరంగా ఎంతో నష్టపోతున్నా ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలమైందని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం రైతులకు చెల్లిస్తానని చెప్పిన రూ.20 వేలు విడుదల చేయాలని గురునాథం డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కె.రమణారెడ్డి, కె.రఘు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

త్రిపురాంతకం: కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని మేడపి గ్రామ సచివాలయంలో ఎన్నికల హామీల్లో ఇచ్చిన వినతిపత్రం అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పెట్టుబడి సాయంగా ఇరవై వేల రూపాయలు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులు 12 లక్షల ఎకరాల్లో పంటలు వేయలేక పోయారన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా సొమ్ము ప్రభుత్వం భరించి రైతులను ఆదుకోవాలని ప్రసాద్ కోరారు. ఈయన వెంట సీపీఐ నాయకులు బాణాల రామయ్య, రామయ్య, డాంగే, వెంకటేశ్వర్లు, బాలనాగయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు


బాలికలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీ


పెద్దారవీడు: రాష్ట్రస్థాయికి ఎంపికైన బాల బాలికలతో ఉపాధ్యాయులు

దర్శి: అండర్-14ఎబాల్ విభాగంలో దర్శి కేజీబీవీ విద్యార్థినులు ఆర్.అంజలి, పి.మానసలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దొనకొండలో ఈ నెల ఒకటో తేదీన జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8,9,10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ, పీఈటీ ఐ.ఆదిలక్ష్మిలు విద్యార్థినులను అభినందించారు.

పెద్దారవీడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎం.కనకదుర్గ సోమవారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడాల్లో రాణించాలని, పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ నెల 2వ తేదీన స్థానిక జిల్లాలో చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-14, అండర్-17 బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి విద్యార్థినీ, విద్యార్థులు జి. చరణ్య, జి.వైష్ణవి, జి.ప్రత్యూషారెడ్డి, జి.పావని, వి.వెంకటేశ్వర్లు, ఎం.విజయకాంత్, ఎం. సుభాష్‌నాయుడులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా తరఫున ఈ నెల 6,7,8 మరియు 29,30 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో జరిగే పోటీల్లో బాల బాలికలు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులను పాఠశాల కమిటీ చైర్మన్ జి. శివశంకరరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఇందిర పేర్కొన్నారు. సోమవారం మండలంలోని యండ్రపల్లి, కొమరోలు ప్రభుత్వ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల వివరాలు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ మారుతున్న సిలబస్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి నోట్ బుక్‌లు తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా రాయడం, చదవడం నేర్పించాలన్నారు. పాఠశాలలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందజేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు చక్కటి బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.